
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY 5

జయశంకర్ భూపాలపల్లి

గురువారం 4 సెప్టెంబరు 2025

వాట్సాప్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ చాట్ బోట్‌తో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఎస్ఈ మల్హార్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు 7901628348 నంబరుకు 'హాయ్' అని వాట్సాప్ మేసేజ్ అని పంపగానే 'వెల్కమ్ టూ టీజీఎస్‌పీడీసీఎల్ కాల్ సెంటర్' అని సందేశం వస్తుందని తెలిపారు. వెంటనే పలు ఆప్షన్లు వస్తాయని, వినియోగదారులు అందులో తమ సమస్యలను పేర్కొంటే పరిష్కరిస్తామని వివరించారు.

విభేదాల గులాబీ

ఓరుగల్లు బీఆర్ఎస్ నేతలపై కవిత హాట్ కామెంట్స్



- కేసీఆర్, కేటీఆర్ వర్గాలుగా విడిపోయారని తీవ్ర వ్యాఖ్యలు
- ఎమ్మెల్సీ పోచంపల్లి వ్యాపారాలపై ఆరోపణలు
- పల్లా - పోచంపల్లి విభేదాలపై ఆసక్తికర ముచ్చట్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలపై కీలక వ్యాఖ్యలు
- ఓరుగల్లు గులాబీ నేతల్లో కవిత వ్యాఖ్యల కలకలం
- పార్టీలో ఇటీవలి పరిణామాలకు బలం చేకూర్చాయంటున్న శ్రేణులు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు గులాబీ నేతలు కేసీఆర్, కేటీఆర్ వర్గాలుగా విడిపోయారని బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ వేటుకు గురైన కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిల మధ్య విభేదాలను ప్రస్తావిస్తూ కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో దుమారం రేపుతున్నాయి. నిజంగా ఓరుగల్లులో కేసీఆర్, కేటీఆర్ వర్గాలుగా పార్టీ నేతలు విడిపోయారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇదిలా వుండగా, చాలాకాలంగా పార్టీలో జరుగుతున్న పరిణామాలు ఈ వ్యాఖ్యలకు బలం చేకూరుతున్నాయి. గత ఏప్రిల్ 27న జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ.. నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతల విషయంలోనూ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారనే విమర్శలు వెల్లువెత్తాయి. వరంగల్ జిల్లా కమిటీకి కార్యవర్గాన్ని కూడా నియమించకపోవడానికి కారణం కూడా పార్టీ నేతల మధ్య ఆధిపత్య పోరే అనే ప్రచారం జరుగుతోంది.

కవిత వ్యాఖ్యల కలకలం

బీఆర్ఎస్ నుంచి వేటుకు గురైన కల్వకుంట్ల కవిత బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఓరుగల్లు గులాబీ నేతలపై హాట్ కామెంట్స్ చేశారు. సంతోష్‌రావు క్లాస్‌మేట్ కావటం వల్లనే ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వేల కోట్ల వ్యాపారాలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. మోకిలాలలో రూ.750కోట్ల విల్లా ప్రాజెక్టు చేస్తున్నారని చెప్పారు. శ్రీనివాస్ రెడ్డికి ఇంత డబ్బు ఎక్కడిదని, సంతోష్ రావు క్లాస్‌మేట్ కావటమే ఆయనకున్న అర్హతని విమర్శించారు. ఈ విషయం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డే చెప్పారని కవిత బాంబు పేల్చారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డిని టార్గెట్ చేసిన కవిత.. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కూడా లాగటంతో గులాబీ శ్రేణుల్లో కలకలం రేగుతోంది.

జనగామలో ఏం జరిగింది?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పట్లో జనగామ ఎమ్మెల్యే టికెట్ కోసం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. అదే సమయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంపై కన్నేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఇక్కడ వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో జనగామ టికెట్ రేసులోకి వచ్చారు. అప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని పక్కన పెడుతున్నారనే ప్రచారంతో రంగంలోకి దిగిన ఎమ్మెల్సీ పోచంపల్లికి పల్లా రూపంలో చెక్ పడింది. దీంతో కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న పోచంపల్లిని కాదని కేసీఆర్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న పల్లాకు టికెట్ వచ్చిందనే ప్రచారం జరిగింది. అయితే ఎన్నికలు పూర్తయి రెండేళ్లు కావొస్తున్న క్రమంలో కవిత ఈ వివాదంపై చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపుతున్నాయి.

వర్ధన్నపేట ఇన్‌చార్జిలో..

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

(మిగతా 6లో..)

రజతోత్సవ సభలో విభేదాలు

గత ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనసమీకరణ బాధ్యతలపై విభేదాలు భగ్గుమన్నట్లు అప్పట్లో కార్యకర్తలు చర్చించుకున్నారు. ఈ సభ నిర్వహణకు సంబంధించి మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆధ్వర్యంలో తొలుత ఉనికిచర్ల వద్ద స్థల పరిశీలన చేశారు. దీంతో కేటీఆర్‌తో సన్నిహితంగా ఉండే నేతల ఒత్తిడితో ఎర్రబెల్లిని బాధ్యతలకు దూరంగా ఉంచటంతో పాటు సభావేదికను కూడా ఎల్కతుర్తికి కేటీఆర్ వర్గం నేతలు మార్చారనే ప్రచారం జరిగింది.




సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు సురేఖ, సీతక్క, లక్ష్మణ్‌కుమార్

- తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనం మహాజాతర
- శాశ్వత నిర్మాణాలు పటిష్టంగా ఉండాలి
- మంత్రులు సురేఖ, సీతక్క, లక్ష్మణ్‌కుమార్

మేడారం ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి

ములుగు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన మేడారం సమ్మక్క-సారక్క వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలోని దేవాదాయ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మేడారం మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష బుధవారం సమీక్షను నిర్వహించారు. మేడారం దేవాలయం నూతన డిజైన్లను మంత్రులు పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై సమాలోచన చేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. మేడారం మహా జాతరను గతంలో కంటే ఈసారి ఘనంగా జరుపుకోవాలన్నారు. పలు మార్లు కుంభామేళా నిర్వహించిన సంస్థకు మేడారం మాస్టర్ ప్లాన్ నిర్వహణ బాధ్యతలను అప్పగించామన్నారు. మేడారం నిర్వహణ పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమ్మక్క- సారలమ్మ పూజారులతో చర్చించి వారి అభిప్రాయం మేరకు ఆధునీకరణ పనులు చేపట్టాలని సూచించారు. భక్తుల దర్శనార్థం అమ్మవార్ల గద్దెల ఎత్తు పెంచాలని పూజారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో తగిన మేర డిజైన్ల మార్పు చేపట్టాలన్నారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా మేడారం పరిసరాలను తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. మేడారం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.150కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. అవసరమైతే ఇతర శాఖల సహాయంతో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, మాస్టర్ ప్లాన్ డిజైన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతితో ముందుకు వెళ్తామన్నారు. మేడారం అభివృద్ధిలో పూజారులను భాగస్వామ్యులను చేస్తామన్నారు. సమ్మక్క-సారక్కల ఔన్నత్యాన్ని మరింత చాటి చెప్పేలా మేడారం ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తామన్నారు. జాతర విజయవంతం కావడం రహదారులపై ఆధారపడి ఉందని, దీంతో మేడారం-ఊరట్టం, మేడారం-కన్నెపల్లితో పాటు మరో నాలుగు మార్గాల విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. డిసెంబరు వరకు పనులు ఎంతమేరకు పూర్తవుతాయో చెప్పాలని అధికారులను కోరారు.

మాస్టర్ ప్లాన్ మొత్తం రెండు విడతలుగా స్థానికంగా అభివృద్ధి పనులు చేపడతామని మంత్రులు పేర్కొన్నారు. గద్దెల అభివృద్ధికి రూ.58.2కోట్లు, గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ.6.8కోట్లు, జంపన్న వాగు అభివృద్ధికి రూ.39కోట్లు, భక్తుల వసతి కోసం రూ.50కోట్లు, రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ. 52.5 కోట్లు, మిగిలిన నిధులు ఇతర పనుల కోసం వెచ్చిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ములుగు కలెక్టర్ దివాకర తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో సంఘాలన్నీ నిర్వీర్యం

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్
- భూపాలపల్లిలో బీఎంఎస్ బహిరంగ సభ


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

6

రుసుము ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు

మీ-సేవ కేంద్రాల నిర్వాహకులతో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్


మీ-సేవ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్

వెంకటాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మీసేవ కేంద్రాల నిర్వాహకులను ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ హెచ్చరించారు. ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలాల్లోని జగన్నాథపురం, పేరూరు, వాజేడు, ఆలుబాక, పాత్రాపురం, మొర్రవానిగూడెం గ్రామాల్లో ఉన్న మీ-సేవ కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేటర్లు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి అన్నిరకాల మీసేవ, భూభారతి, మిగతా ఆన్‌లైన్ సర్వీసులను ప్రజలకు అందించాలన్నారు. మీసేవ సెంటర్‌లలో తప్పకుండా సిటిజన్ చాప్టర్, భూభారతికి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో, తహసీల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్‌సెంటర్ల ఫోన్ నంబర్లు ఉండేవిధంగా చూడాలన్నారు. కల్యాణలక్ష్మి, డెత్ సర్టిఫికెట్లలో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని అన్నారు. ప్రజలు ఆధార్ సేవల గురించి ఇబ్బందులు పడుతున్నదృష్ట్యా త్వరలో మండలంలో కొత్త ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్, మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ

టేకుమట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని కుందనపల్లి గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ ద్వారా నానో యూరియాను పిచికారీ చేశారు. మండల వ్యవసాయాధికారి కల్యాణి దీన్ని పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల పంట పెరుగుదల ఉంటుందన్నారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేయడంతో కూలీల కొరతను అధిగమించొచ్చన్నారు.


డ్రోన్ పిచికారీని పరిశీలిస్తున్న ఏవో

విద్యార్థుల ఆరోగ్యమే ప్రధానం

- నాణ్యమైన ఆహారం అందించాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యమే ప్రధానమని, వారికి నాణ్యమైన ఆహారం అందించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను విద్యార్థినులు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాకు ఫోన్‌చేసి సమస్యలను తెలిపారు. వెంటనే వాటికి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు పనిచేయడం లేదని, తరగతి గదుల్లో ఫ్యాన్లు లేవని, డిజిటల్ తరగతుల నిర్వహణకు ఆన్‌లైన్ సౌకర్యం లేదని విద్యార్థినులు తన దృష్టికి తెచ్చారన్నారు. క్రీడా సామగ్రి ఇంకా ఇవ్వలేదని, కిటికీలకు జాలీలు లేక దోమలు కుడుతున్నాయని, వచ్చేది శీతాకాలం కావడంతో వేడి నీటి కోసం గ్రీజర్లు ఏర్పాటు చేయాలని తెలపడంతో తాను చలించిపోయానని అన్నారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఏ సమస్య వచ్చినా.. తనకు ఫోన్ చేసి తెలపాలని విద్యార్థినులకు సూచించారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు వైద్యం అందిస్తోందన్నారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు దాట్ల శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, శిరుప అనిల్, ముంజాల రవీందర్ తదితరులు ఉన్నారు.


భోజనంలో నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పాలనలో

రైతులకు కష్టాలు

- కేసీఆర్ మాటలు నిజమయ్యాయి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి


చిట్యాలలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

చిట్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు కష్టాలు, కన్నీళ్లు తప్పవని కేసీఆర్ చెప్పిన మాటలు నేడు నిజమవుతున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి వ్యాఖ్యానించారు. యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ యూరియా అందక రైతులు నానా అవస్థలు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించు కోకపోవడం నిరంకుశ పాలనకు నిదర్శనమని విమర్శించారు. రైతులకు యూరియా అందించడం మానేసి కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో మాట్లాడుతూ సమయాన్ని వృథా చేస్తున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేయాలని హిత వు పలికారు. రైతులు వారం రోజులుగా యూరియా కోసం ఇబ్బందులు పడుతుంటే స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు కావాల్సిన యూరియాను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో పెరుగుతున్న గోదావరి

- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- వాజేడులో అంతర్‌రాష్ట్ర రాకపోకలకు అంతరాయం
- కన్నాయిగూడెంలో సమ్మక్క సాగర్ బ్యారేజీ గేట్లు ఎత్తివేత


వాజేడు మండలం పూసూరు-ముళ్లెకట్ట వంతెన వద్ద గోదావరి పరవళ్లు

ఏటూరునాగారం రూరల్/మహదేవపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో గోదావరి ఉధృతి పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లోని శ్రీరామ సాగర్, కడెం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రధాన ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో భారీగా వరద నీరు గోదావరిలో చేరుతోంది. రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన గోదావరి బుధవారం ఉదయం క్రమంగా పెరగడం మొదలైంది. కన్నాయిగూడెం మండలం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఉధృతి పెరిగింది. బుధవారం 7,67,390 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో ప్రాజెక్టు 59 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద 7,67,390 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతోంది. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. 14.830 మీటర్లను దాటి ప్రవహిస్తుండటంతో జలవనరుల శాఖ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వాజేడు మండలంలోనూ గోదావరి పెరుగుతోంది. పేరూరు వద్ద 84.5 మీటర్ల నీటిమట్టం నమోదైంది. గోదావరికి వరద తాకిడి పెరగడంతో 163వ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరి అంతర్‌రాష్ట్ర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగపేట మండలం కమలాపురం ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. 82.5 అడుగుల నీటిమట్టం నమోదైంది. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గోదావరిలోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఆదేశాలు జారీ చేశారు.

కాళేశ్వరం వద్ద నిలకడగా..

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద కాస్త నెమ్మదించడంతో బుధవారం కాళేశ్వరం వద్ద ఉధృతి తగ్గింది. 11.35మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది.

పాము కాటుతో బాలిక మృతి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాము కాటేయడంతో బాలిక మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణ పరిధిలోని జంగేడుకు చెందిన గూడెపు మల్లయ్య- రేష్మా దంపతుల రెండో కుమార్తె సాన్విశ్రీ (9) పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. రోజు మాదిరిగానే కుటుంబ సభ్యులంతా మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పైకప్పు నుంచి పాము సాన్విశ్రీ నిద్రిస్తున్న బెడ్‌పై పడి ఆమె చెవిపై కాటేసింది. దీంతో నిద్రలోంచి లేచిన బాలిక ఏడవడంతో తల్లిదండ్రులు మేల్కొని పాము పరుగులు తీయడాన్ని గమనించారు. వెంటనే సాన్విశ్రీని ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది.


సాన్విశ్రీ (ఫైల్)

అదుపు తప్పిన స్కూల్ బస్సు

కాటారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు బుధవారం స్టీరింగ్ రాడ్ ఫెయిలై అదుపు తప్పింది. విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు వస్తుండగా స్టీరింగ్ రాడ్ ఊడిపోవడంతో బస్సు పక్కకు దూసుకెళ్తుండగా డ్రైవర్ సమయస్ఫూర్తితో కంట్రోల్ చేశాడు. దీంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నారని స్థానికులు తెలిపారు.

WANTED
పరకాల పట్టణంలోని
చైతన్య మోడల్ హై స్కూల్‌లో
పని చేయుటకు అనుభవం
కలిగిన డ్రైవర్లు, క్లీనర్లు కావలెను.
Cont : 7337069698





ఎంపీ కడియం కావ్యతో గ్రామీణ వైద్యుల సంఘ నాయకులు

గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

ఎంపీ కావ్యకు వినతిపత్రం అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బుధవారం హనుమకొండలో గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. ఇటీవల గ్రామీణ వైద్యులపై అధికారులు చేస్తున్న దాడులను పరిశీలిస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఘన్‌పూర్, చిలుపూర్ గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు బయ్యా గట్టయ్య, పి.చంద్రమౌళి, వి.కొంరెల్లి, వి.వెంకటేశ్వర్లు, పి.రవీందర్, దినేష్, బీరయ్య, ఎం.ఉమాశంకర్, రమేశ్, పి.సంపత్‌రెడ్డి, మంద శ్రీను, సాంబయ్య, పి.సదానందం, సంపత్‌కుమార్, సీహెచ్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర రాకపోకలకు మళ్లీ అంతరాయం



పేరూరు–చంద్రుపట్ల మధ్యలో నిలిచిన వరద నీరు

వాజేడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని భూపాలపల్లి-హైదరాబాద్ జాతీయ రహదారి టేకులగూడెం వద్ద రేకుమాగు వాగు వరద ఉధృతి పోటెత్తింది. దీంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు మళ్లీ అంతరాయం ఏర్పడింది. గోదావరి వరద ఉధృతి ఒక్కసారిగా పెరగటంతో రేకుమాగు వాగుకు ప్రవాహం పెరిగింది. రెండు రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగును దాటకుండా పేరూరు పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిషేధించారు.

అడవులపై పరిశోధనలో అప్పయ్యకు డాక్టరేట్



కేసముద్రం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం ఉప్పరపల్లికి చెందిన సహాయ అటవీ సంరక్షణాధికారి(ఏసీఎఫ్) అయిన హైదరాబాద్ అర్బన్ ఫారెస్ట్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎనల్ల అప్పయ్యకు అనంతపూర్ భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. 'తెలంగాణ రాష్ట్ర అభయారణ్యాలలోని వృక్షవైవిధ్యం, అడవుల స్థితిగతులు మరియు అనుసరించవలసిన సంరక్షణ వ్యూహాలు' అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో ఆయనకు డాక్టరేట్ అందజేసినట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నాగజ్యోతి బుధవారం ప్రకటించారు. అటవీశాఖలో ఉన్నతోద్యోగిగా పనిచేస్తూ తాజాగా డాక్టరేట్ పొందడంపట్ల గ్రామస్తులు, సన్నిహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైలుకిందపడి గుర్తుతెలియని దివ్యాంగుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి

కేసముద్రం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రైల్వేస్టేషన్ డౌన్ లూప్ లైనులో బుధవారం తెల్లవారుజామున సుమారు 45ఏళ్ల గుర్తుతెలియని దివ్యాంగుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు తెలిపారు. మృతునికి కుడికాలు లేదని, తాను వాడుతున్న రెండు చేతికర్రలను ప్లాట్‌ఫాంపై పెట్టి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడు నల్లరంగు ప్యాంటు, తెలుపు అంగీ, నీలంరంగు రేయిన్‌కోట్ ధరించాడని, కుడిచేతిపై 'అమ్మ' అని, ఎడమచేతిపై లవ్ గుర్తు పచ్చబొట్లు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు 9441557232 నెంబరులో సంప్రదించాలని హెచ్‌సీ సూచించారు.

రైతులకు యూరియా అందజేస్తాం

- మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్
- శ్రీముసలమ్మ దేవతకు మొక్కులు

కొత్తగూడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వందశాతం యూరియా అందజేస్తామని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతుందని ఎంపీ బలరాం నాయక్ పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడులోని శ్రీముసలమ్మ దేవతను ఆయన బుధవారం దర్శించకున్నారు. ముందుగా ఈవో శేషగిరి, పూజారులు తోలెం వెంకటేశ్వర్లు, వెంకన్న, నవీన్ సంప్రదాయంగా ఎంపీకి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర నుంచి రావాల్సిన యూరియా సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి రోజు సీఎం రేవంత్‌రెడ్డి యూరియా తెప్పించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. హామీ ఇచ్చిన పథకాల కంటే అనేక పథకాలు అందజేస్తున్నామన్నారు. రాబోయే కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో మరిన్ని పథకాలు ప్రవేశ పెడుతామని పేర్కొన్నారు.

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సహకారంతో ములసమ్మ జాతర అభివృద్ధికి కృషి చేస్తానని వివరించారు. మంత్రి సీతక్క సహకారంతో కొత్తగూడ నుంచి గూడూరు, పాఖాల నుంచి గంగారం వరకు రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితపై సస్పెండ్ గూర్చి మాట్లాడుతూ కవితతో, హరీశ్‌రావుతో, బీఆర్‌ఎస్ పార్టీతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వరరావు, మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బోడ ఈర్యా నాయక్, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, భూర్క నరేందర్, హలావత్ సురేష్, గుమ్మడి సమ్మయ్య, వెల్దండి వేణు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉబ్బని శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.



గుంజేడులో శ్రీముసలమ్మ దేవతను దర్శించుకుంటున్న ఎంపీ బలరాం నాయక్

సింగరేణిలో సంఘాలన్నీ నిర్వీర్యం

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో చైతన్యం చచ్చిపోయిందని, సంఘాలన్నీ నిర్వీర్యమయ్యాయని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్మిక పోరాట బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో సింగరేణితో ఎంతో అనుబంధం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సైతం సింగరేణి, ఆర్టీసీ కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలని, వారిని దూరం చేయొద్దనే అంశాన్ని తానే లేవనెత్తానని గుర్తు చేశారు. ఆ రోజుల్లో సంఘాలకు సమస్యలు అర్థమయ్యేవని, మరిప్పుడు కార్మిక సంఘాలే సంస్థలను భ్రష్టు పట్టిస్తున్నాయనే పరిస్థితికి వచ్చిందని అన్నారు. ఒకప్పుడు 25 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సమయంలో 1 లక్షా 16 వేల మంది కార్మికులు ఉన్నారన్నారు. నేడు 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతున్నా 39 వేల మంది కార్మికులే ఉన్నారని తెలిపారు. గతంలో సింగరేణికి రూ. 2 వేల కోట్లు బకాయి ఉంటే గగ్గోలు పెట్టామని, ప్రస్తుతం రూ. 43 వేల కోట్లు ప్రభుత్వం బాకీ పడిందని విమర్శించారు. స్వప్నం భూతల్లి ఇచ్చిన వరం సింగరేణి సంపదకు సంబంధించిన సీఎస్ ఆర్ నిధులు ప్రస్తుతం దేనికి వినియోగిస్తున్నారో తెలియడం లేదన్నారు. ఇతర రాష్ట్రాల ప్రైవేటు కాంట్రాక్టర్లు వచ్చి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు.

అన్‌ఫిట్లలో పైరవీలు, బ్రోకర్లు లేనిదే ఏపని కూడా కావడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సైతం ఉద్యోగ భద్రతా ఇవ్వాలని, సింగరేణి కార్మికులకు 40 శాతం బోనస్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంఘాల్లో ఐక్యత రావాలని, హక్కులను గల్లా పట్టుకొని అడిగే స్థితిలో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సీతారాం నాయక్, అరూరి రమేష్, బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి, నారాయణరెడ్డి, అప్పాని శ్రీనివాస్, వెలబోయిన సుజేందర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటయ్యను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

కాళేశ్వరాలయంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు

మహదేవపూర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో తోపాటు సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, కుర్సంగి లీలాదేవి, నేనావత్ రాంబాబునాయక్ పూజల్లో పాల్గొన్నారు. వెంకటయ్యకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామి వారి శేష వస్త్రాలతో కార్యనిర్వహణాధికారి ఎస్.మహేష్ సన్మానించారు.

వనదేవతలకు వైస్ చాన్సలర్ల పూజలు

తాడ్వాయి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను వివిధ రాష్ట్రాల వైస్ చాన్సలర్స్ బుధవారం సందర్శించారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం సిమ్లా నుంచి సంజయ్ శర్మ, త్రిపురా నుంచి మిలాని రాణి, పాండిచ్చేరి నుంచి వై.వెంకటరావు, కర్ణాటక రాష్ట్రం బెంగుళూర్ నుంచి విష్ణుకంటి, గుజరాత్ రాష్ట్రం రాజ్కోట్ నుంచి నవీన్ చంద్ దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు గిరిజన సంప్రదాయలతో వారికి స్వాగతం పలికారు. దేవతల గద్దెలకు ప్రత్యేక పూజలు చేసిన వైస్ చాన్సలర్లు మొక్కులు సమర్పించారు.

ఫోర్జరీ సంతకంతో యూరియా

బస్తాలు తీసుకొన్న ఇద్దరు రైతులు

రికవరీ చేసిన పీఏసీఎస్ అధికారులు

మహాముత్తారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో అసిస్టెంట్ సీఈవో సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇద్దరు రైతులు గుట్టుచప్పుడు కాకుండా 30 యూరియా బస్తాలు తీసుకెళ్లిన ఘటన వెలుగుచూసింది. గోదాంలో నిల్వలను తెలిపే డీబీటీ ఫర్టిలైజర్ టీపీఎస్ మిషన్‌ను పరిశీలించగా ఈ విషయం వెల్లడైంది. నిల్వ ఉన్న యూరియాలో 30 బస్తాలు తక్కువగా రావడంతో అధికారులు మిషిన్‌ను చెక్ చేశారు. అందులో నిల్వలు ఉన్నట్టే చూపించగా కంగుతిన్నారు. అసలేం జరిగిందనే విషయంపై ఆరా తీయగా విస్మయం కలిగించే విషయం వెల్లడైంది. అథెంటికేషన్ పరికరంలో వేలుముద్ర వేయకుండా ఆధార్ జిరాక్స్ కాపీలపై అసిస్టెంట్ సీఈవో శ్రీనివాస్ సంతకాన్ని ఫోర్జరీ చేసి యామనపల్లికి చెందిన ఇద్దరు రైతులు వేర్వేరు సందర్భాల్లో 30 బస్తాలను తీసుకెళ్లినట్టు వెల్లడైంది. సేల్స్‌మన్ వద్దకు ఫోర్జరీ సంతకంతో ఆధార్ జిరాక్స్ కాపీలు తీసుకెళ్లి ఇలా బస్తాలను గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్లినట్టు సీఈవో మార్క శ్రీధర్ గుర్తించారు. అనంతరం ఆ రైతుల నుంచి 30 బస్తాలను రికవరీ చేశారు. దీనిపై సీఈవో ను వివరణ కోరగా ఇద్దరు రైతులు మిషన్ వద్ద వేలి ముద్ర వేయకుండా 25 ఆధార్ జిరాక్స్ కాపీలపై ఫోర్జరీ సంతకం చేసి సెల్స్‌మన్ నుంచి బస్తాలు తీసుకున్నారని తెలిపారు. వారిని గుర్తించి యూరియా బస్తాలను రికవరీ చేశామని, తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించామన్నారు.

విభేదాల గులాబీ

(5వ పేజీ తరువాయి)

బీజేపీలో చేరటంతో ఈ స్థానానికి ఇన్‌చార్జి బాధ్యతలపై మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీ పోచంపల్లి మధ్య పోరు నడిచింది.

ప్రస్తుతం ఎస్సీ రిజర్వుడు స్థానంగా ఉన్నప్పటికీ డీలిమిటేషన్‌లో జనరల్ స్థానంగా మారుతుందని భావిస్తున్న నేతలు.. ఇన్‌చార్జి బాధ్యతలు వస్తే వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీకి దిగవచ్చునని అంచనాలతో బాధ్యతల కోసం పోటీపడ్డారని చర్చ జరిగింది. అయితే కేసీఆర్ ఎర్రబెల్లి వైపు మొగ్గుచూపటంతో పోచంపల్లి సర్దుకుపోవాల్సి వచ్చిందనే ప్రచారం జరిగింది.

మానుకోట, భూపాలపల్లి, పశ్చిమలోనూ..

మహబూబాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలను మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కు అధిష్ఠానం అప్పగించింది. అయితే నియోజకవర్గంలో కేడర్‌ను సమన్వయం చేయటంలో సత్యవతిరాథోడ్ వైఫల్యం చెందారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి విమర్శించటంతో మానుకోట గులాబీలో విభేదాలు రచ్చకెక్కాయి. ఇక భూపాలపల్లి నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, వచ్చే ఎన్నికల్లో టికెట్ రమణారెడ్డికేనని భూపాలపల్లిలోనే కార్యకర్తల సమక్షంలో కేటీఆర్ ప్రకటించి వచ్చారు. అయినప్పటికీ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నియోజకవర్గంలో పర్యటించటం ఏమిటనే చర్చ జరుగుతోంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు చెక్ పట్టేందుకు ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన ఓ యువనేతను కేసీఆర్‌తో సన్నిహితంగా ఉండే మరో ప్రజాప్రతినిధి ప్రోత్సహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

విభేదాలతో వరంగల్ కమిటీకి బ్రేక్..

అంతర్గత విభేదాలతో బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా కమిటీని కూడా నియమించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న అరూరి రమేష్ బీజేపీలో చేరటంతో పదవి ఖాళీ అయింది. ఏడాది దాటినా ఇప్పటి వరకు నూతన అధ్యక్షుడిని నియమించటంతో నేతల మధ్య విభేదాలు అడ్డు వస్తున్నాయనే చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌తో పాటు జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, తదితర నేతలు జిల్లా అధ్యక్ష పదవిని చేపట్టేందుకు సుముఖంగా ఉన్నప్పటికీ అధిష్ఠానంపై వ్యతిరేక శిబిరం ఒత్తిడి తెస్తుండటంతో అధ్యక్షుడు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవాల్సి వస్తోందనే చర్చ జరుగుతోంది. కాగా, మొత్తంగా ఓరుగల్లు గులాబీ నేతలపై కవిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వరంగల్ నేతలు కేసీఆర్, కేటీఆర్ వర్గాలు విడిపోయారని ఆమె చేసిన వ్యాఖ్యలు గులాబీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి.



WANTED HOSPITAL STAFF

★ Lab-Technicians, Pharmacy Sales, OT-Technicians, Insurance/Claims & Computer Operators with Experience in Hospital Feild. Cont : Guardian Hospital Wgl. 2 pm to 3 pm

AJW-549

WANTED

★ లేడీస్ హాస్టల్‌లో వంట చేయడానికి వంట మాస్టర్ కావలెను. బిర్యాని వచ్చి ఉండాలి. హాస్టల్‌లో ఉండాలి మరియు మహిళ వర్కర్స్ కావలెను. వసతి భోజనం ఉచితం. అడ్రస్ : మమునూరు దగ్గరలో బొల్లికుంట. సం॥ప్ర॥ 9989323727

AJW-237492

WANTED

★ బెల్లం చాయ్ షాపు (NIT) నందు పని చేయుటకు వర్కర్ కావలెను. ఉదయం 5 గం॥ నుండి సాయంత్రం 7:30 గం॥ వరకు జీతం: 10,000–12000. సం॥ప్ర॥ 9700871260

AJW-243123

FLATS FOR SALE

★ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్ SPR స్కూల్ దగ్గరలో Stilt plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సం॥ప్ర॥ 7660008666, 8309035091

AJW-27937

HOUSE FOR SALE

★ HNK Opp : KUC Police Station, రుద్రమదేవి కాలని, రోడ్ నెం.8, భీమారం 3/2 BHK Ready to Move, మూడు ఇండిపెండెంట్ ఇండ్లు, 160 Sqy, Rs.68 Lakhs కి అమ్మకానికి కలవు. సం॥ప్ర॥ 9118706786, 8074260608.

AJW-243067

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ 9985400013 8978510273 9985411677

వరంగల్ 9949638376 9985408173

జనగామ 9866431354

మహబూబాబాద్ 9985418040

తొర్రూర్ 9985418040

నర్సంపేట 9949638376

భూపాలపల్లి 9985401232

పరకాల 9985401232



గార్లలో మాట్లాడుతున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి

● మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్

గార్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గార్లలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు దాని ఫలితంగా రైతులు యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఆడుతుందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గానీ, కార్యకర్తలు సిద్ధంగా ఉండి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, పానుగంటి రాధ, పి.లింగయ్య, కోట ఉత్తరయ్య, మీగడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల రూ. 5 లక్షలు గల్లంతు

పీఎస్‌లో ఫిర్యాదు

బచ్చన్నపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామంలో పింఛన్‌దారులకు సంబంధించిన రూ. 5 లక్షలు గల్లంతైన ఘటన బుధవారం వెలుగు చూసింది. పోచన్నపేటలో బీపీఎంగా పనిచేస్తున్న ఆలీంపూర్ గ్రామానికి చెందిన నాగయ్య, పెన్షన్‌దారులకు సంబంధించిన రూ. 5 లక్షలు తీసుకు రావాల్సిందిగా ఏబీఎం రాకేశ్‌ను కోరారు. ఇందుకు సంబంధించిన డబ్బులు ఎస్పీఎం యాదయ్య ద్వారా నాగయ్యకు అప్పగించినట్లు రికార్డులు చూపుతున్నాయి. కాగా రాకేష్ తీసుకువచ్చిన డబ్బులు తనకు చేరలేదని బీపీఎం నాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ ఎస్‌కే అహ్మద్ నేతృత్వంలో విచారణ జరుపుతున్నారు.

కాకతీయుల శిల్ప సంపద అద్భుతం

భారత విదేశాంగ అధికారులు

గణపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకతీయుల శిల్ప సంపద అద్భుతమని భారత విదేశాంగ శాఖకు సాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన ఐఎఫ్ఎస్ అధికారులు శ్రీకర్ రెడ్డి, బ్రూనై భారత హై కమిషనర్ రాము అబ్బగాని కొనియాడారు. కోటగుళ్ల ప్రాకారపు ఆలయాలు, శివ ద్వార పాలక విగ్రహాలు తమనెంతో ఆకట్టుకున్నాయని, ఈ శిలా సంపదను భావితరాలకు అందించాలని అన్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్లను కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి బుధవారం పరిశీలించారు. ముందుగా అర్చకులు నాగరాజు వారిని పూర్ణకుంభంతో స్వాగతం పలికి గణపతి, నందీశ్వర, గణపేశ్వర పూజలను నిర్వహించారు. అనంతరం తాళ్లపల్లి యాదగిరి అధికారుల బృందానికి ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివద్వార పాలక విగ్రహాలను చూసి ఫోటోలు, వీడియోలు చిత్రీకరించుకున్నారు.

అనంతరం అర్చకులు వారిని శాలువాతో సన్మానించారు. అంతేకాకుండా మండల కేంద్రంలోని పీహెచ్‌సీని, ప్రభుత్వ పాఠశాల, చెల్పూరులోని మిల్లెట్ హౌస్‌లను సందర్శించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల హాజరు పట్టిక, టైమ్ టేబుల్, డ్రిల్ పిరియడ్, యోగా తరగతులు నిర్వహణపై విచారించారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఉపాధ్యాయులను సూచించారు. అలాగే చెల్పూరులోని మిల్లెట్స్ యూనిట్‌ను సందర్శించి మిల్లెట్స్ తయారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. వారి వద్ద మిల్లెట్స్ కొనుగోలు చేశారు. మిల్లెట్స్ రుచి చూసి బాగుందని అభినందించారు. వారి వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీవో బాలకృష్ణ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, డీపీఎం రవి తదితరులు ఉన్నారు.



కోటగుళ్ల శిలా చిత్రాలను పరిశీలిస్తున్న భారత విదేశాంగ అధికారులు

దేవాదుల ప్రాజెక్టుతో సస్యశ్యామలం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టుతో జనగామ జిల్లా సస్యశ్యామలంగా మారిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని తాటికొండ గ్రామ పరిధిలో రూ.29 కోట్లతో నిర్మించిన మల్లన్నగండి కుడి కాలువను ఎంపీ కడియం కావ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీహరి మాట్లాడారు. కుడి కాలువ నిర్మాణం అద్భుతమన్నారు. త్వరలోనే మల్లన్నగండి ఎడమ కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. కాలువ పనులు ప్రారంభించి 20వేల ఎకరాలకు సాగు నీరందిస్తామన్నారు. అంతకముందు ఈ ప్రాంతం తీవ్ర కరువుతో ఉండేదన్నారు. రాష్ట్రంలో నేడు జనగామ జిల్లా అత్యధిక వరి ధాన్యం పండిస్తున్న జిల్లాగా మారిందన్నారు. గత ప్రభుత్వం దేవాదులను పట్టించుకోలేదని విమర్శించారు. దేవాదుల ఫేజ్-3, ప్యాకేజీ-6 పనులు పూర్తి చేయాలని తద్వారా ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని 78 వేల ఎకరాలకు సాగు నీరందుతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

దీంతో సీఎం స్పందించి రూ.1,015 కోట్ల నిధులకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఏడాది లోపు ప్యాకేజీ-6 పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు. ఏడాదిన్నర కాలంలోనే నియోజకవర్గానికి రూ.1000 కోట్ల నిధులు తీసుకువచ్చానని తెలిపారు. కొందరు నాయకులు 15 ఏళ్లు అధికారంలో ఉండి ఏం చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయాలు చేసేవారిని ప్రజలు మరిచిపోతారని తెలిపారు. సంపాదన కోసం రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి విశేష కృషి చేస్తున్నారని ఎంపీ కావ్య అన్నారు. ఏడాదిన్నరలో నియోజకవర్గానికి రూ.800 కోట్ల నిధులు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యేదన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తన వద్దకు రావొచ్చన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ప్రతీ గ్రామంలో ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్ పర్సన్ లావణ్య, చిలుపూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు నరేందర్ రెడ్డి, కరుణాకర్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు నాగరబోయిన శ్రీరాములు, రాపోలు మధుసూదన్‌రెడ్డి, బెలిదె వెంకన్న, చల్లా సుధీర్ రెడ్డి, బేతి జైపాల్ రెడ్డి, కొలిపాక సతీష్, నాగరబోయిన యాదగిరి, సారంగపాణి, వరలక్ష్మి, రాపోలు చరణ్‌రెడ్డి, సురేష్, చాడ రాజ్‌కుమార్, వక్కల రాజు, ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, ఈఈ వినయ్‌బాబు, డీఈ సంపత్, ఏఈ యాసర్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌దీప్ గోల్‌తో గట్టెక్కింది!

కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా

ఆసియా కప్ హాకీ


రాజ్‌గిర్ (బిహార్): ఆట ముగిసేందుకు మరో ఎనిమిది నిమిషాలే ఉంది. స్కోరు చూస్తే భారత్ 1-2తో కొరియాతో సూపర్ ఫోర్ తొలి మ్యాచ్‌లో వెనుకంజలో ఉంది. దాంతో ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్‌కు తొలి పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ ఈ దశలో ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్ మాయ చేశాడు. లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి హర్మన్‌ప్రీత్ అందించిన రివర్స్ పాస్‌ను సుఖ్‌జీత్ సింగ్..మన్‌దీప్ వైపు కొట్టాడు. బంతిని అందుకున్న మన్‌దీప్ నలుగురు కొరియా డిఫెండర్లను బోల్తాకొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. స్కోరు 2-2తో సమం. భారత ఫ్యాన్స్‌లో ఆనందం. సూపర్-4లో భాగంగా కొరియాతో బుధవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసింది. దాంతో టోర్నమెంట్‌లో అపజయమెరుగని రికార్డును ఆతిథ్య జట్టు కొనసాగించింది. ఎనిమిదో నిమిషంలోనే హార్దిక్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. యాంగ్ జిహూన్ (12) గోల్‌తో స్కోరు సమం చేసిన కొరియా..కొద్ది సేపటికే కిమ్ (14) సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. డ్రా దరిమిలా రెండు జట్లు చెరో పాయింట్ దక్కించుకున్నాయి. మరో సూపర్ ఫోర్ పోరులో మలేసియా 2-0తో చైనాను చిత్తు చేసింది. ఇక గురువారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొంటుంది.



మన్‌దీప్ సింగ్

జోకో.. జోరు

యూఎస్ ఓపెన్



సెమీస్‌కు నొవాక్, సబలెంక



సబలెంక

న్యూయార్క్: 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, మహిళల డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గతేడాది రన్నరప్, లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌తో ముఖాముఖి పోరులో ఏడో సీడ్ జొకో తన రికార్డును 11-0తో మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో 6-3, 7-5, 3-6, 6-4తో నాలుగో సీడ్ ఫ్రిట్జ్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ క్రమంలో 53వసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన నొవాక్.. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ 52సార్లు సెమీస్ చేరిన రికార్డును బద్దలుకొట్టాడు. సెమీస్‌లో అల్కారజ్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తొలి సెట్‌లో నొవాక్ అలవోకగా నెగ్గినా.. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి పోటీ ఎదురైంది. అయితే, 5-5 వద్ద తనదైన దూకుడు ప్రదర్శించిన నొవాక్ సెట్‌ను సొంతం చేసుకొని 2-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, మూడో సెట్‌లో ఫ్రిట్జ్ పోరాడి గెలిచినా.. ఆ తర్వాతి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేక పోయాడు. 2003లో చివరిసారి అమెరికా ఆటగాడు ఆండీ రాడిక్ న్యూయార్క్‌లో టైటిల్ నెగ్గాడు. ఈసారి ఫ్రిట్జ్ ఆ లోటు తీరుస్తాడను కొంటే.. జొకో అడ్డుపడ్డాడు. కాగా, టాప్‌సీడ్ సబలెంకకు క్వార్టర్స్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి మార్కెటా వొండ్రుసోవా (చెక్) ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె బరిలోకి దిగలేక పోయింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో గతేడాది ఫైనలిస్ట్ పెగులతో స బలెంక తలపడనుంది.

భాంబ్రి తొలిసారి..: యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రి-మైకేల్ వీనజ్ (న్యూజిలాండ్) జంట 6-4, 6-4తో జర్మనీకి చెందిన కెవిన్ క్రవీట్జ్-టిమ్ ప్యూట్జ్‌పై గెలిచింది.

నొవాక్ 'సోడా పాప్' సంబరాలు


మ్యాచ్ గెలిచిన తర్వాత జొకోవిచ్ 'కె-పాప్ డీమన్ హంటర్స్' సినిమాలోని 'సోడా పాప్' పాట డ్యాన్స్‌తో సంబరాలు చేసుకొన్నాడు. జొకో కుమార్తె తారకు 'కె-పాప్ డీమన్ హంటర్స్' అంటే ఎంతో ఇష్టం. కాగా, తార పుట్టిన రోజు కావడంతో.. ఆ డ్యాన్స్ మూమెంట్స్ ద్వారా కుమార్తెకు జొకో శుభాకాంక్షలు తెలిపాడు.

సినర్‌పై రూ. 2.64 కోట్ల పందెం

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ నిలబెట్టుకొంటాడని కెనడా ర్యాపర్, సింగర్ డ్రేక్ భారీగా బెట్టింగ్ పెట్టాడు. ఇటలీ టాప్ సీడ్ ప్లేయర్‌పై డ్రేక్ రూ. 2.64 కోట్లు పందెం కాశాడు. ఒకవేళ సినర్ విజయం సాధిస్తే.. డ్రేక్‌కు రూ. 4.46 కోట్లు దక్కనున్నాయి.

నిఖత్‌పై అందరి దృష్టి!

నేటినుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ గురువారం ఇక్కడ ఆరంభం కానున్నాయి. ప్రపంచ బాక్సింగ్ కొత్త పాలక మండలి..'వరల్డ్ బాక్సింగ్' ఆధ్వర్యంలో తొలిసారి ఈ పోటీలు జరగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాలలో కలిపి ఒకేసారి నిర్వహిస్తుండడం విశేషం. ఇక..భారత్‌కు సంబంధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్‌పై అందరి దృష్టి నిలిచింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ వరుసగా మూడో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు వేర్వేరు బరువు విభాగాలలో తలపడుతుండడం గమనార్హం. 2022లో 52కి. విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన నిఖత్.. 2023లో 50కి. కేటగిరీలో టైటిల్ దక్కించుకుంది. ఇక ఈసారి 51 కి. విభాగంలో తలపడుతోంది. మారిన బరువు విభాగంలో నిఖత్ ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరం. పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసిన జరీన్.. ఏడాది తర్వాత అంతర్జాతీయ పోటీల బరిలో దిగుతోంది. పారిస్ క్రీడల తర్వాత నిఖత్‌తోపాటు లవ్లీనా ఒక దేశవాళీ ఈవెంట్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఇద్దరికీ తొలి రౌండ్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురు కానున్నారు. 65 దేశాల నుంచి 550మంది బాక్సర్లు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తలపడుతున్నారు. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో చెరి పదేసి మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

రోహిత్, గిల్ అండ్ కోకు 'బ్రాంకో టెస్ట్' లేనట్టే..



న్యూఢిల్లీ: భారత జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తూంటుంది. ఇది రొటీన్‌గానే జరిగేదే అయినా.. సరికొత్తగా 'బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నారని కొద్ది రోజుల క్రితం వచ్చిన వార్త కారణంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. రగ్బీ ఆటగాళ్లకు నిర్వహించే ఈ కఠిన పరీక్షను రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ప్రవేశపెడుతున్నారంటూ విమర్శలు కూడా వినవచ్చాయి. తాజా సీజన్ నేపథ్యంలో రోహిత్, శుబ్‌మన్ గిల్, బుమ్రా సహా మరికొందరు కాంట్రాక్ట్ ప్లేయర్లు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరయ్యారు. అయితే, వీరెవరికీ బ్రాంకో టెస్ట్ నిర్వహించలేదని తెలుస్తోంది. ఈ నూతన టెస్ట్‌ను ఇంకా ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగం చేయలేదట. అందుకే పాతపద్ధతిలో యో-యో టెస్ట్ ద్వారానే ఫిట్‌నెస్‌ను పరీక్షించిందట. పైగా బోర్డు కూడా బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నట్టు అధికారికంగా కూడా ప్రకటించలేదు.

బెంగాల్‌పై పుణెరి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12 తొలి అంచెలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 45-36 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచి పల్టన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడి వారియర్స్‌పై ఒత్తిడి పెంచారు. ప్రథమార్ధం 26-22 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్ధంలో పుంజుకునేందుకు యత్నించిన బెంగాల్ వారియర్స్‌ను పుణెరి డిఫెండర్లు నిలువరించారు. వారియర్స్ కెప్టెన్, స్టార్ రైడర్ దేవాంక్ పలుమార్లు ప్రత్యర్థి డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్‌పై పట్టు కోల్పోయారు. పుణెరి జట్టులో అస్లాం ఇనాందార్, ఆదిత్య షిండే చెరో 11 పాయింట్లు సాధించారు. హరియాణా స్టీలర్స్-యు ముంబా జట్ల మ్యాచ్ 36-36తో టైగా ముగిసింది. అయితే షూటౌట్‌లో హరియాణా విజయం సాధించింది.

శ్రీలంకదే తొలి టీ20

హరారే: జింబాబ్వేతో తొలి టీ20లో శ్రీలంక గెలుపొందింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 175/7 చేసింది. దుష్మంత చమీర 3 వికెట్లు తీశాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 177/6 స్కోరు చేసి గెలుపొందింది. నిస్సాంక (55), కమిందు మెండిస్ (41 నాటౌట్) రాణించారు.

ఇకపై మరింత బాధ్యతగా ఉంటాం

'చిన్నస్వామి' ఘటనపై కోహ్లీ



న్యూఢిల్లీ: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో గత జూన్ నాలుగున జరిగిన తొక్కిసలాటపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఎట్టకేలకు స్పందించాడు. 'అది.. మా ఫ్రాంచైజీ చరిత్రలో ఓ సంతోషకరమైన ఘట్టం కావాల్సింది. కానీ విషాదంగా మారింది. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన మా అభిమానుల గురించి ఆలోచిస్తున్నా. వారి గురించి ప్రార్థిస్తున్నా. ఇకపై జాగ్రత్తగా, బాధ్యతగా, గౌరవంగా ముందుకు సాగుతాం' అని కోహ్లీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సీజన్ ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ గెలుచుకున్న సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది క్రికెట్ ఫ్యాన్స్ మరణించగా, మరో 71 మంది గాయపడ్డారు.

కబడ్డీ విజేత జోగులాంబ లయన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ తెలంగాణ కబడ్డీ లీగ్ ట్రోఫీని జోగులాంబ లయన్స్ జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో లయన్స్ 35-21 స్కోరుతో భద్రాద్రి బ్రేవ్స్ జట్టుపై నెగ్గింది. లీగ్ ఉత్తమ రైడర్‌గా జి.రాజు, డిఫెండర్‌గా నవీన్, ఆల్‌రౌండర్‌గా లక్ష్మణ్‌కు ప్రత్యేక అవార్డులు లభించాయి. ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేష్, కార్యదర్శి మహేందర్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేశారు.

తిప్పేసిన నితిన్



చెన్నై: బుచ్చిబాబు ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్లో హరియాణాను 99 పరుగులతో ఓడించి హైదరాబాద్ జట్టు ఫైనల్‌లో ప్రవేశించింది. బుధవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో హరియాణా 272 పరుగుల లక్ష్యంతో ఛేదన ప్రారంభించగా, హైదరాబాద్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నితిన్ సాయి యాదవ్ (7/44) దెబ్బకు 62.4 ఓవర్లలో 181కు ఆలౌటై పరాజయం పాలైంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 225, హరియాణా 208కు, రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 254కు ఆలౌటయ్యాయి. హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులతో రాణించిన వరుణ్ గౌడ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

వృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఊతం

జీఎస్‌టీ సంస్కరణలపై హర్షాతిరేకాలు



ప్రభుత్వం బుధవారం ప్రకటించిన జీఎస్‌టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

స్టాక్ మార్కెట్ పరుగే

జీఎస్‌టీ నిర్ణయం గురువారం స్టాక్‌మార్కెట్‌కు పెద్ద ఉత్తేజం కావచ్చునని మార్కెట్ నిపుణులంటున్నారు. ఇటీవల కాలంలో ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు భారీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మార్కెట్ తాత్కాలికంగా ఊపిరి తీసుకోవడం ఖాయమని, గురువారం మార్కెట్ సానుకూలంగా స్పందించవచ్చునని పరిశీలకులన్నారు.

పురోగామి చర్య : ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు.ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎస్‌టీ నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు.

చిన్న కార్ల ధరలు ఎంత తగ్గొచ్చు..?

4మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీతోపాటు ఒక శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై కేంద్రం 28 శాతం జీఎస్‌టీతోపాటు 3 శాతం సెస్సు వసూలు చేస్తోంది. ఈ విభాగ కార్లను తాజాగా 18 శాతం శ్లాబులో చేర్చారు. దీంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ మోడళ్ల ధరలు 8-10 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేసింది. మారుతి సుజుకీ చిన్న కారు ఆల్టో కే10 ఎక్స్‌షోరూమ్ ధర రూ.4..23 లక్షల నుంచి రూ.3.89 లక్షలకు తగ్గే అవకాశం ఉంది. హ్యుండయ్ హ్యాచ్‌బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ10 మోడల్ రేటు రూ.5.98 లక్షల నుంచి రూ.5.51 లక్షలకు దిగిరావచ్చు. రెనో క్విడ్ ఎక్స్ షోరూమ్ ధర కూడా రూ.40,000 వరకు తగ్గవచ్చని అంచనా.

ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎస్‌టీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎస్‌టీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

రియల్టీ, మౌలిక రంగాలకు బూస్ట్ : సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతం తగ్గించడం రియల్ ఎస్టేట్, మౌలిక రంగాల నిర్మాణ వ్యయాలను గణనీయంగా తగ్గించనుందని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు, హీరానందిని గ్రూప్ చైర్మన్ నిరంజన్ హీరానందిని అన్నారు. ముఖ్యంగా అందుబాటు గృహ ప్రాజెక్టులకు లబ్ధి చేకూరనుందని, నిర్మాణ వ్యయం తగ్గితే కొనుగోలుదారులకు ఈ గృహాలు మరింత తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటు: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జీడీపీ ఏటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ట్రంప్ 50 శాతం సుంకాలతో ఎగుమతి ఆధారిత రంగాల వ్యాపారంపై ప్రభావం చూపనున్న తరుణంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగాన్ని పెంచి వృద్ధి రేటుకు అండగా నిలవనుందని హీరానందాని అన్నారు.

బిజినెస్

బంగారం @ రూ.1.07 లక్షలు

వరుసగా 8 రోజుల్లో రూ.6,900 అప్



పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5% స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు మున్ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — పెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,970 ▲	98,050 ▲	1,37,000 ▲
విజయవాడ	1,09,000 ▲	1,03,000 ▲	1,26,700 ▲
విశాఖపట్నం	1,09,430 ▲	97,250 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,960 ▲	98,050 ▲	1,26,400 ▼
ప్రొద్దుటూరు	1,07,200 ▲	98,620 ▲	1,26,000 ▲
ముంబై	1,06,020 ▲	97,120 ▲	1,23,220 ▲

మారుతి కొత్త కారు విక్టోరిస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ విభాగంలో బ్రెజ్జా, ఫ్రాంక్స్, జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి మోడళ్లను విక్రయిస్తున్న కంపెనీ.. విక్టోరిస్ పేరుతో మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని బుధవారం ఆవిష్కరించింది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్, టయోటా హైరైడర్, టాటా కర్వ్, స్కోడా కుషాక్, ఫోక్స్‌వేగన్ టైగున్‌కు పోటీగా ఈ కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతోంది. 1.5 లీటర్ పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ ఇంజన్ ఆప్షన్లతో కూడిన ఈ కారును అరెనా షోరూమ్స్ ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు వేరియంట్లు, పది రంగుల్లో లభించనున్న ఈ కారులో మారుతి పలు ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. రూ.11,000తో బుకింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన కంపెనీ.. కారు ధరను త్వరలోనే ప్రకటించనుంది. దీని ప్రారంభ ధర రూ.9.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. భద్రతకు సంబంధించి ఈ కారుకు 5-స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

తొలుత తడబాటు.. ఆఖర్లో జోరు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90% శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63% ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

హైదరాబాద్-ఆమ్‌స్టర్‌డామ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసు

కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నెదర్లాండ్ కేంద్రంగా పని చేసే కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ మన దేశంలో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌కు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించింది. వారానికి మూడు రోజులు ఈ సర్వీసులు నడుస్తాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టెన్ స్టీనెన్ చెప్పారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబై తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు నాలుగో ప్రవేశ ద్వారమని తెలిపారు. ప్రస్తుతం ఈ నాలుగు నగరాల నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వారానికి 24 విమాన సర్వీసులు నడుపుతోంది. వింటర్ సీజన్‌లో ఈ సర్వీసులను 27కు పెంచనున్నట్టు మార్టెన్ స్టీనెన్ చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నుంచి సరుకు రవాణాకు అద్భుత అవకాశం ఉందన్నారు. బోయింగ్ 777-200ఈఆర్ విమానాలతో ప్రారంభించిన హైదరాబాద్-అమెస్టర్‌డ్యామ్ విమాన సర్వీసులో వివిధ తరగతుల్లో 288 మంది ప్రయాణించ వచ్చని కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌లో యునిస్పేస్ మెగాస్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : నిర్మాణ, నిర్మాణ పరికరాల రంగంలోని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) హైదరాబాద్‌లోని మియాపూర్‌లో యునిస్పేస్ మెగాస్టోర్‌ను ప్రారంభించింది. ఇది ఆసియాలోనే అతి పెద్ద స్టోర్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తమ రిటైల్ విస్తరణలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లో కూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నట్టు చెప్పారు. భవన నిర్మాణంలో ఉపయోగించే 20 రకాల వస్తువులకు ఇది వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఉంటుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రేయాస్ త్రివేది వెల్లడించారు. కస్టమర్లకు ఇంటి డిజైన్, నిర్మాణం, ఆధునీకరణ వంటి సేవలన్నీ ఒకే ఛత్రం కింద అందించాలన్నది తమ కాన్సెప్ట్ అని ఆయన చెప్పారు. ఇది కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆయన అన్నారు.

అందరికీ గణపయ్య ఆశీస్సులు ఉండాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



వినాయక మండపం వద్ద ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణపయ్య ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆకాంక్షించారు. భూపాలపల్లి పట్టణంలోని పలు వినాయక మండపాలను ఆయన బుధవారం సందర్శించారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లోక కల్యాణార్థం వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశానని ఆయన తెలిపారు. ప్రజలందరికీ ఆ విఘ్నేశ్వరుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామప్ప ఆలయాన్ని సందర్శించిన భారత కాన్సుల్ జనరల్



ఆలయ శిల్పకళా సంపద గురించి తెలుసుకుంటున్న అధికారులు

వెంకటాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని భారత విదేశాంగ శాఖకు చెందిన సాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సుల్ జనరల్ శ్రీకర్ కేరెడ్డి, బ్రూనై భారత హై కమిషనర్ రాము అబ్బగానిలు ఉన్నతాధికారులతో కలిసి బుధవారం సందర్శిచారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు, ఉద్యోగులు వారిని సాదరంగా ఆహ్వానించగా రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించి విశిష్టత, చరిత్రను గైడ్ గోరంట్ల విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, స్థానిక తహసీల్దార్ గిరిబాబు, గణపురం తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ విజేందర్, తదితరులు ఉన్నారు.

బంజారాలు దుష్ప్రచారాలు నమ్మొద్దు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

ములుగు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంజారాలు దుష్ప్రచారాలను నమ్మొద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం బంజార నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్ర ఆదివాసీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పలు సమస్యలను విన్నవించారని తెలిపారు. నియోజకవర్గాల్లో కాలేజీలు, ఇందిరమ్మ ఇళ్లు పలు అభివృద్ధి పనుల గురించి వినతిపత్రం అందించగా కొన్ని రాజకీయ పార్టీలు ఆ విషయాన్ని వక్రీకరించారని అన్నారు. బంజారాలను ఎస్టీ రిజర్వేషన్ జాబితా నుంచి తొలగించాలని దానికి సీతక్క మద్దతిస్తున్నారని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ తప్పుడు ప్రచారాన్ని బంజారాలు నమ్మొద్దని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి చందర్

గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు

అప్రమత్తంగా ఉండాలి

ములుగు ఎస్పీ శబరీశ్

మంగపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) గోదావరి పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు ఎస్పీ శబరీశ్ అన్నారు. మండలంలోని కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి వరద ఉధృతిని ఆయన బుధవారం పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ గోదావరి నది ఉధృతంగా ఉందని, అటువైపు ఎవరూ వెళ్లొద్దని అన్నారు. ముఖ్యంగా చేపల వేటకు వెళ్లొద్దని, పడవల్లో నది దాటొద్దని సూచించారు. విపత్కర పరిస్థితులు ఏమైనా ఎదురైతే పోలీసుల సహాయం తీసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజల కు జిల్లా విపత్తు ప్రతిస్పందన దళాలు(డీడీఆర్ఎఫ్) బృందా లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతకు ముందు మంగ పేట పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఆయన వెంట ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్పీ ఎస్సై శంకర్, స్థానిక ఎస్సై సూరి ఉన్నారు.



బిల్ట్ ఇన్‌టేక్ వద్ద గోదావరిని పరిశీలిస్తున్న ఎస్పీ

గోవిందరావుపేటకు హాస్టల్ మంజూరు చేయాలి : ఎస్ఎఫ్ఐ

గోవిందరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేట మండలానికి ఎస్టీ బాలుర ఎస్ఎంహెచ్ హాస్టల్‌ను మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేడారం,నార్లాపూర్, కొడిశాల ప్రాంతాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు జూనియర్ కళాశాలలో చదువుకోవడానికి వస్తున్నారని, వారికి హాస్టల్ వసతిలేకపోవడంతో చదువులకు దూరమవుతున్నారని అన్నారు. అదేవిధంగా సంక్షేమ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను, బిల్లులను విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మరుగు దొడ్లు, తరగతిగదుల్లో ఫ్యాన్లు, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్.రవి, కళాశాల కమిటీ నాయ కులు చరణ్, మహేశ్వర్, రోహిత్, మానస, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దు

డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్

వెంకటాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏటూరునాగారం డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతికుమార్ అన్నారు. బుధవారం ఆయన ఎదిర ఆరోగ్యకేంద్రం పరిధిలోని రంగరాజపురం, మరికాల గ్రామాల్లో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వైద్యులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్‌సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో కోటిరెడ్డి, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, సూర్యకుమారి, రోజారాణి, సుశీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా కరాటే పోటీల్లో ప్రతిభ

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెంగళూరులో జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ములుగు జిల్లా విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారని జిల్లా క్రీడా అధికారి ఎం.సరాద ర్‌సింగ్ తెలిపారు. 13ఏళ్ల విభాగం 5కిలోల కేటగిరీలో కుంటా వర్షిత్ బంగారు పతకం సాధించాడని, జూనియర్స్ బాలురు 68కిలోల విభాగంలో బడావత్ దినేష్ కాంస్య పతకం సాధించాడని అన్నారు. ఈసందర్భంగా బుధవారం ములుగులో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను సర్దార్‌సింగ్ సన్మానించి అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో శిక్షణను కొనసాగిస్తే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ సాయిల్లో మెరిసే అవకాశం ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో కరాటే కోచ్ ఎమ్డీ.హుస్సేన్, రెజ్లింగ్‌కోచ్ సతీష్, క్రికెట్ కోచ్ సందీప్, సైక్లింగ్ కోచ్ శ్రీరామ్, జిల్లా క్రీడాశాఖ జూనియర్ అసిస్టెంట్ లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కన్నాయిగూడెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చింతగూడెం పాఠశాలలో ఎస్టీటీగా విధులు నిర్వర్తించి ఎస్ఏగా ప్రమోషన్‌పై వెళ్తున్న రౌతు రాజును తోటి ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు ప్రజ్ఞ, రాజేంద్రాచారి, సారంగపాణి, లావణ్య, నర్సింహులు, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న రాయితీపై వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు కోరారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వివిధ రకాల వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు, మహిళా రైతులకు 50 శాతం రాయితీ, పెద్ద రైతులకు 40 శాతం రాయితీపై లభించే పరికరాలలో బ్యాటరీ పంపులు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, రోటోవేటర్లు, కల్టివేటర్లు, ప్లవ్, స్పీడ్ కంపాక్ట్ డ్రిల్‌చ పవర్ వీడర్, బ్రష్ కట్టర్, టిల్లర్, బేలర్ వంటివి ఉన్నాయని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్‌లో ప్రతిభ

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు పతకాలు దక్కాయి. ఈ మేరకు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ తెలిపారు. ఆగస్టు 27 నుంచి 31వరకు చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో భూపాలపల్లి జిల్లా నుంచి విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొని విజేతలుగా నిలిచారని తెలిపారు. పాయింట్ ఫైటింగ్ పోటీలో మాదాసి విధిష, కిక్‌లైట్ ఫైటింగ్ విభాగంలో తాడబోయిన హరిణి కాంస్య పతకాలను సాధించారని వివరించారు. ఈ సందర్భంగా వారిని రాష్ట్ర అధ్య క్షుడు రామాంజనేయులు, కార్యదర్శి మహిపాల్, కోచ్ అశోక్‌తోపాటు మాదాసి శ్రీనివాస్ అభినందించారు.



విద్యార్థులతో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, అశోక్

రైతులందరికీ యూరియా అందాలి

కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

మహాముత్తారం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా అందాలని కాటారం సబ్ కలెకర్ మయాంక్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో యూరియా పంపిణీని ఆయన బుధవారం పసరిశీలించారు. సీఈవో శ్రీధర్‌ను యూరియా పంపిణీపై వివరాలను అడిగి తెలుసుకొన్నారు. పలు రికా ర్డులను ఆయన పరిశీలించారు. అంతరం హైస్కూల్, ఎస్టీ, బీసీ హాస్ట ల్‌ను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ డి. శ్రీనివాస్, పీఏసీఎస్ అసిస్టెంట్ సీఈవో శ్రీనివాస్, వార్డెన్లు శంకరయ్య, రాజు ఉన్నారు.

నానో యూరియాతో అధిక ప్రయోజనాలు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బాబురావు

కాటారం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నానో యూరియా, నానో డీఏపీ వాడకంతో పలు ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బాబురావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పీఏసీఎస్ గోడౌన్, డీసీఎంఎస్ సెంటర్లు, ఆగ్రోస్, రైతు సేవాకేంద్రాల వద్ద ఏడీఏ శ్రీపాల్‌తో కలిసి బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రైవేట్ ఎరువుల షాపుల ముందు నానో యూరియా, యూరియా బస్తాల వాడకంతో కలిగే ప్రయోజనాలు, ఇబ్బందులతో కూడిన ఫ్లెక్సీలను పెట్టించారు. నానో యూరియాతో పంటల దిగుబడులు పెరగడమే కాకుండా భూములకు ఇబ్బందులు కల్గవన్నారు. ఏవో ఎస్ఎంఎస్ పూర్ణిమ, ఏఈవోలు రాజన్న, అస్మా, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

8.03 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 8.03లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.20మీటర్లు ఉంది.

మంత్రి శ్రీధర్‌బాబుకు యువకుల వినతి

మహాముత్తారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామన్‌పల్లి గ్రామ సమ్మక్క దేవాలయ ఆవరణలో తాగు నీటి కోసం బోరు, భక్తులు ఉండటానికి షెడ్డు నిర్మించాలని కోరుతు మంత్రి శ్రీధర్‌బాబుకు హైదరాబాద్‌లో యువకులు వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని యువకులు తాటిపెల్లి రాజబాపు, రత్నం రాజసమ్మయ్య తెలిపారు.

ఇసుక తరలిస్తూ పొలంలో ట్రాక్టర్ బోల్తా

- పంటకు తీవ్ర నష్టం

కాటారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ మానేరు నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా అదుపు తప్పిన ట్రాక్టర్ పొలంలో బోల్తాపడింది. ట్రాలీ పొలంలోనే బోల్తాపడటంతో ఇసుక అంతా కప్పేసి వరి పంట పాడైందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టకపోవడంతో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నదని ఆరోపించారు. పలువురు అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతర మండలాలు, జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. పలు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, దారికి ఇరువైపులా ఉన్న పొలాలు పాడవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాల ని డిమాండ్ చేశారు

సైన్స్ కార్యక్రమాలను ముందుకు నడపాలి

కాటారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్-మనాక్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్-మిలియన్ మైండ్స్ అగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) నామినేషన్లను త్వరగా పూర్తి చేసి జిల్లాను సైన్స్ కార్యక్రమాల అభివృద్ధిలో ముందంజలో నిలపాలని జిల్లా సైన్స్ అధికారి స్వామి కోరారు. కాటారం జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం డివిజన్‌లోని కాటారం, మల్హర్‌రావు, మహాదేవపూర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లోని సైన్స్ టీచర్లకు ఇన్‌స్పైర్ నామినేషన్లపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన స్వామి మాట్లాడుతూ పాఠశాల విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇన్‌స్పైర్-మనాక్ అవార్డు కాంపిటీషన్ కోసం ప్రతి పాఠశాల నుంచి 5నామినేషన్లు రావాల న్నారు. జూన్ 15నుంచి ఈ నెల 15 వరకు నామినేషన్లకు గడువు ఉండగా జిల్లాలో చాలా తక్కువగా నమోదయ్యాయన్నారు. ఈ నెల 10లోగా అన్ని ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇన్‌స్పైర్ నామినేషన్లు పూర్తి చేయాల న్నారు. నామినేషన్‌కు విద్యార్థుల బ్యాంకు ఖాతా, రైట్ అప్ లను సిద్ధంచేసి నామినేషన్లు పూర్తి చేయాలన్నారు. నామినేషన్ ఐడియా ఎంపికైతే రూ.10వేల అవార్డు ఇవ్వబడుతుందని, వాటిని సైన్స్ ప్రాజెక్టు తయారీ, రవాణా కోసం ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సోమలింగం, ఎంఈవో శ్రీదేవి, ఫిజిక్స్ సైన్స్ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గండు రాజబాబు, బయోలాజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.



ర్యాలీని నిర్వహిస్తున్న సైన్స్ టీచర్లు

సైన్స్ టీచర్లు అవగాహన ర్యాలీ

మండల కేంద్రంలో కాటారం డివిజన్ సైన్స్‌టీచర్ల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలంటూ బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలి నుంచి మండల విద్యా వనరుల కేంద్రం వరకు ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం..పర్యావరణాన్ని కాపడదాం ..అంటూ నినాదాలు చేస్తూ ప్ల కార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో స్వామి, ఎంఈవో శ్రీదేవి, ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ ఫోరమ్స్ జిల్లా ప్రధాన కార్యదర్శు లు గండు రాజబాబు, ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ సైన్స్ టీచర్స్ మడక మధు, రాజునాయక్, వెంకటేశ్వర్లు, పద్మజ, మంజుల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించొద్దు

ములుగు టౌన్ (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించొద్దని తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.10వేల వేతనం, కార్మికులను తొలగించకుండా జీవో జారీ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండు ఏళ్లవుతున్నా హామీని అమలు చేయడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, సంఘం జిల్లా అధ్యక్షురాలు సామల రమ, కార్యదర్శి గున్నాల రాజకుమారి, ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, మహిళ నాయకులు భారతి, కమల, రాధ, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుడి ఆత్మహత్య

ములుగు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి మునిసిపల్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మాధవరావుపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివారాల ప్రకారం.. మంద మహేష్ (35) ములుగు మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి రాగా భార్యతో జీతం విషయంపై ఘర్షణ జరిగింది. బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మరో ప్రచారం కూడా జరుగుతోంది. మంచినీరు అనుకొని పురుగుల మందు తాగాడని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలి

ఏటూరునాగారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏరియా ఆస్పత్రిగా మార్చి, పడకల సంఖ్యను 100కి పెంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో ఉన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు వైద్యం కోసం ఏటూరునాగారం వస్తున్నారని, కానీ ఇక్కడ కేవలం 30 పడకలు మాత్రమే ఉన్నాయన్నారు. ఆస్పత్రిలో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఉందని, తక్షణమే రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని ఆయన అన్నారు. కొత్త భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్, జిల్లా నాయకులు అరుణ్, లాజర్, కృష్ణబాబు, రాఘవేంద్ర, నాగేశ్వరరావు, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బారి నుంచి రక్షణ కల్పించాలి

గ్రామ పంచాయతీ ఎదుట సీపీఎం నిరసన

గోవిందరావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోతులబారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మండలంలోని పస్రాలో వినూత్నంగా ప్రదర్శన నిర్వహించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా సీపీఎంపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గొంది రాజేష్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రతి కుటుంబం కోతుల సమస్యతో బాధపడుతుందని, ఇప్పటికే వేలాదిమంది కోతుల దాడిలో గాయపడ్డారని అన్నారు. ఇళ్లలో ఉన్న సామగ్రికి రక్షణలేకుండా పోయిందని, దీంతో పిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారని అన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో అనేక అవస్థలు పడుతున్నారని, కోతుల సమస్య సామాజిక సమస్యగా మారిందని పేర్కొన్నారు. కోతుల నివారణకు గ్రామపంచాయతీ, అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోతుల నివారణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. కోతుల వల్ల రైతుల పంట పొలాలకు నష్టం జరుగుతుందని, గ్రామాల్లోని చిరువ్యాపారులు, పండ్ల వ్యాపారులు, రోడ్లపై వెళ్లే ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఎంపార్టీ జిల్లా నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, తీగల ఆగిరెడ్డి, మండల నాయకులు సోమ మల్లారెడ్డి, కడారి నాగరాజు, వల్లపు రాజు, జిట్టబోయిన రమేష్, సువర్ణ, అశోక్, అరుణ్, న్రు, కృష్ణారావు, జీవన్ పురుషోత్తంరెడ్డి, గణేష్, శ్రావణ్, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు సాధన సమితి నిరసన

కాటారం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో మహాధర్నా పేరుతో ఆందోళన చేపట్టారు. చింతకాని క్రాస్ నుంచి ర్యాలీ నిర్వహించిన అనంతరం రాస్తారోకో చేశారు. సాధన సమితి నేతలు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించగా ఫ్రీజ్ చేసిన రెండో విడత దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దళితబంధు నిధులు విడుదల చేయాలని, లేదంటే అంబేద్కర్ అభయ హస్తమైనా అమలు చేయాలని అన్నారు.



రాస్తారోకో చేస్తున్న సాధన సమితి నాయకులు

రైతాంగ సమావేశాన్ని విజయవంతం చేయాలి

తాడ్వాయి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 6న జరగబోయే విస్తృతసాయి రైతాంగ సమావేశాన్ని విజయవంతం చేయాలని మేడారం జాతర పంట నష్ట పరిహార సాధన సమితి అధ్యక్షుడు ఆలం కృష్ణార్జున్ కోరారు. సమ్మక్క- సారలమ్మల దేవస్థానం నుంచి ప్రచార రథాన్ని పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునీందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కృష్ణార్జున్ మాట్లాడుతూ మహాజాతర సమయంలో వాహనాల కోసం వందల ఎకరాలు పార్కింగులను ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో ఎకరాకు 50వేల వరకు రైతులు నష్టపోతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 6న విస్తృతసాయి రైతాంగ సమావేశాన్ని నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి గౌరవ అధ్యక్షుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు సిద్దబోయిన శివరాజు, గొంది శ్రీధర్, ఆలం సమ్మారావు, జంగ హన్మంతరెడ్డి, మాదరి శ్రీకాంత్, చెంగల సుభాష్, రాదరాపు కిరణ్, నల్లమొక్క లక్ష్మీసమ్మయ్య, గోపాలపురం సతీష్, సంకె ప్రణయ్, చిక్క శేకర్, బచ్చల బాబురావు, ఎం.డి.సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

7న హేమాచల క్షేత్రం ద్వారా బంధనం

మంగపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చంద్రగ్రహణం నేపథ్యంలో ఈనెల 7న మండలంలోని మల్లూరు హేమాచల ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి పుణ్య క్షేత్రంలో మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి ప్రధానాలయంతో పాటు ఉప దేవాలయాలను ద్వారా బంధనం చేయనున్నట్టు ప్రధాన అర్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ, దేవస్థానం ఈవో మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న గ్రహణ మోక్షకాలం(గ్రహణం విడిచిన తర్వాత) ఉదయం సంప్రోక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి దర్శనం యధావిధిగా ఉంటుందని తెలిపారు.

యూరియా సరఫరాపై తప్పుడు ఆరోపణలు

ములుగు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాపై బీఆర్ఎస్, బీజేపీ నేతలతు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలని కాంగ్రెస్ అనుబంధ కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. యూరియా సరఫరా చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమే అనే విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లాకు గత సంవత్సరం కన్నా అధికంగానే యూరియా వచ్చిందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జయశంకర్
Jayashankar Aco - 9985426984,
Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram
SR - 7673960447 ACM - 9985411664